
సాక్షి చిత్తూరు

సోమవారం | 14 | ఆగస్టు | 2023



జిజ్ఞాస భూమిక..విజ్ఞాన వీచిక

ఇన్‌స్పైర్ మనక్ పోటీల నిర్వహణకు జిల్లా విద్యాశాఖాధికారులు కసరత్తు ప్రారంభించారు. - 8లో



శాస్త్రోక్తంగా భీజాక్షర హోమం

చిత్తూరు శ్రీకన్యాకపరమేశ్వరి ఆలయంలో ఆదివారం భీజాక్షర హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	36	25
తిరుపతి	36	25
తిరుమల	32	22
గూడూరు	38	28
నగరి	36	26

న్యూస్‌రీల్

ఆర్టీసీకి ఆడికృత్తిక ఆదాయం

చిత్తూరు రూరల్: ఆడికృత్తిక ఉత్సవాలకు చిత్తూరు –తిరుత్తణి మధ్య రెండురోజులపాటు నడిపిన ప్రత్యేక బస్సుల ద్వారా ఆర్టీసీకి రూ. 5.71 లక్షల ఆదాయం వచ్చినట్టు ఆర్టీసీ టూ డిపో అసిస్టెంట్ మేనేజర్ అల్తాఫ్ తెలిపారు. భరణి, కృత్తికకు 28 బస్సులు కేటాయించగా, ఈ రెండు రోజులపాటు 144 ట్రిప్పులుగా 10, 224 కిలోమీటర్లు నడిపామన్నారు. మొత్తం 3033 మంది భక్తులు ప్రయాణించగా.. కిలోమీటర్‌కు రూ.56 చొప్పున రూ.5.71 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆయన వివరించారు.

వలంటీర్ కుటుంబానికి సాయం



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: మండలకేంద్రంలో వలంటీర్‌గా పనిచేసిన అనూష కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.50 వేల చెక్కును ఎమ్మెల్సీ భరత్ ఆదివారం అందజేశారు. కరోనా సమయంలో అనూష ఆకస్మికంగా మృతిచెందారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి భరత్ విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.50 వేలు చెక్కును ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో మృతురాలి తండ్రి ప్రకాష్‌కు భరత్ అందజేసారు. ప్రకాష్ మాట్లాడుతూ సీఎం,మంత్రి, ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేయవచ్చని పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన జరుగుతుందన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు స్పందన కు తప్పనిసరిగా హాజరుకావాలని, గైర్హాజరయ్యే వారిపై శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

నేడు పోలీసు స్పందన

చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడవచ్చని పేర్కొన్నారు.

భక్తజన బోయకొండ



క్యూలో వేచి ఉన్న భక్తులు

చౌడేపల్లె: వరుస సెలవులు రావడంతో ఆదివారం బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో పోటెత్తింది. తల్లి దీవెనలకోసం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలనుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. కొండపై ఎటుచూసినా సందడి కనిపించింది. వేలాది మంది భక్తులు వివిధ వాహనాల్లో తరలివచ్చారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనె దీపాలు, దీవెలతో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఎస్ఐ రవి కుమార్ ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటు చేశారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ



భక్తులతో నిండిన క్యూలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఆదివారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. శని, ఆదివారాలు వరుస సెలవులు రావడంతో స్వామివారి దర్శనార్థం భక్తులు అశేషంగా తరలి వచ్చారు. ఆదివారం ఉదయం నుంచే కంపార్ట్‌మెంట్‌లు, క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తులు త్వరితగతిన దర్శనం చేసుకునేలా ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వృద్ధులు, గర్భిణులను ప్రత్యేక క్యూల్లో దర్శనానికి అనుమతించారు.

సేద్యానికి యంత్ర సేవ



రైతు సంఘాలకు ట్రాక్టర్ తాళాలు అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు(ఫైల్)



లబ్ధిదారులకు అందజేసిన ట్రాక్టర్లు

వ్యవసాయరంగానికి ప్రభుత్వం చేయూత నందిస్తోంది. ఆధునిక పరికరాలతో సేద్యాన్ని కొత్తపుంతలు తొక్కిస్తోంది. వినూత్న పథకాలతో వెన్నుదన్నుగా నిలుస్తోంది. అందులో భాగంగా 'వైఎస్సార్ యంత్ర సేవ'ను పకడ్బందీగా అమలు చేస్తోంది. ఆర్‌బీకే ద్వారా రైతు సంఘాలకు వ్యవసాయ సామగ్రిని అందజేస్తోంది. ముఖ్యంగా ట్రాక్టర్లు.. హార్వెస్టర్లు.. తదితర యంత్రాలను సబ్సిడీపై పంపిణీ చేస్తోంది. సాగు విస్తీర్ణం పెంచడమే లక్ష్యంగా అన్నదాతను ప్రోత్సహిస్తోంది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేలా పూర్తిస్థాయిలో సహకరిస్తోంది.

- ఆధునిక వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం
- కస్టమర్ హైరింగ్ సెంటర్ల ద్వారా సహకారం
- వైఎస్సార్ యంత్ర సేవ కింద సబ్సిడీపై పరికరాలు
- ఆర్‌బీకేల ద్వారా లబ్ధిపొందిన 495 రైతు సంఘాలు

సాక్షి, చిత్తూరు : రైతు సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోంది. విప్లవాత్మకమైన సంక్షేమ పథకాలతో సాయం అందిస్తోంది. పెట్టుబడి నిధి నుంచి పంటలకు గిట్టుబాటు కల్పించే వరకు అండగా ఉంటోంది. అందులో భాగంగా సేద్యానికి మరింత సహకారం అందించేందుకు ఆధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. జిల్లాలోని మొత్తం 502 రైతు భరోసా కేంద్రాల ద్వారా క్షేత్రస్థాయిలో అన్నదాతలకు సబ్సిడీపై పంపిణీ చేస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే రెండు విడతలుగా వివిధ పరికరాలను అందించింది. ఆర్‌బీకేల్లోని కస్టమర్ హైరింగ్ కేంద్రాల ద్వారా రైతులు తమకు అవసరమైన ట్రాక్టర్లు, యంత్రాలను సులువుగా పొందే వెసులుబాటు కల్పించింది.

ఐదుగురు ఉంటే చాలు

గ్రామంలో ఐదుగురు రైతులుంటే చాలు. వారు సంఘంగా ఏర్పడి ట్రాక్టర్లు, యంత్ర పరికరాలను తీసుకోవచ్చు. అందులో ప్రధానంగా ట్రాక్టర్లు, ట్రైలర్లు, రోటొవేటర్లు, కల్టివేటర్లు, పవర్ వీడర్లు, మల్టీ క్రాప్ థ్రెషర్స్, చాఫ్ కట్టర్లు, బుష్ కట్టర్లు, లెవలింగ్ బ్లేడ్లు, ఎస్ టైప్ కల్టివేటర్లు తదితర పరికరాలను సబ్సిడీపై పొందవచ్చు.

40 శాతం రాయితీ

ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు అవసరమైనవారు తమ రైతు సంఘాల ద్వారా ట్రాక్టర్ ధరలో 10 శాతం చెల్లించాలి. ప్రభుత్వం 40శాతం సబ్సిడీ భరిస్తుంది. మరో 50 శాతం సొమ్మును బ్యాంకుల ద్వారా రుణం మంజూరు చేయిస్తుంది.



ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

తక్కువ అద్దెకే..!

రైతు సంఘాల వారు తాము పొందిన ట్రాక్టర్లు, యంత్ర సామగ్రిని కస్టమర్ హైరింగ్ సెంటర్ల ద్వారా ఆయా ఆర్‌బీకేల పరిధిలోని అన్నదాతలకు తక్కువ అద్దెకు ఇస్తున్నారు. తద్వారా వచ్చిన సొమ్మును రుణాలను చెల్లించేస్తున్నారు. రుణాలు పూర్తిగా చెల్లించేసిన తర్వాత యంత్ర పరికరాలు రైతు సంఘాల వారు కస్టమర్ హైరింగ్స్ సెంటర్లను ఆర్థికంగా మరింత బలోపేతం చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద రెండు విడతల్లో మొత్తం 495 గ్రూపులకు రూ.32.97 కోట్ల విలువైన 495 ట్రాక్టర్లు, 1,017 యంత్ర పరికరాలను పంపిణీ చేశారు. అందులో రూ.11.17కోట్లను సబ్సిడీ కింద ప్రభుత్వం భరించడం విశేషం.

నియోజకవర్గాల వారీగా ప్రభుత్వం చెల్లించిన సబ్సిడీ వివరాలు (రూ.లక్షల్లో)

చిత్తూరు	పూతలపట్టు	కుప్పం	పలమనేరు	పుంగనూరు	నగరి	జీడీ నెల్లూరు
61.1	164.75	160.17	228.54	221.17	69.92	218.84



ట్రాక్టర్‌తో లబ్ధిదారుడు

రైతులకు సాయం



జిల్లాలో వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. సేద్యాన్ని సులభతరంగా, లాభసాటిగా మార్చేందుకు యంత్ర పరికరాలు, ట్రాక్టర్లు మంజూరు చేస్తున్నాం. అన్నదాతలు గ్రూపులుగా మారి ఒకరికొకరు సహకరించుకునేలా అవగాహన కల్పించాం. రైతులు ముందుకువచ్చి ఆధునిక వ్యవసాయం దిశగా అడుగులు వేస్తున్నారు. వైఎస్సార్ యంత్రసేవను సద్వినియోగం చేసుకుంటున్నారు.

– షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు

అద్దెతో రుణం తీరుస్తున్నాం



మా గ్రూపు ద్వారా వైఎస్సార్ యంత్రసేవ పథకం కింద రూ.7.46 లక్షల విలువైన ట్రాక్టర్ తీసుకున్నాం. అందులో మేము రూ.1.73 లక్షలు చెల్లించాం. ప్రభుత్వం రూ.2లక్షల సబ్సిడీ ఇచ్చింది. బ్యాంకు నుంచి రూ.3.73 లక్షల రుణం పొందాం. ట్రాక్టర్‌ను వ్యవసాయ పనులకు పంపడం ద్వారా ఇప్పటికే రూ.40 వేల రుణం తీర్చాం. బాధ్యత గ్రూపులోని ఐదుగురిపై ఉండడం వల్ల వాహనాన్ని చూసుకోవడం సులువుగా ఉంది.

– శంకరనారాయణ, వైఎస్సార్ రైతు మిత్ర గ్రూప్, కనమనపల్లె, గుడుపల్లె మండలం

ఆనందంగా ఉంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి అండగా నిలుస్తున్నారు. మా గ్రూపునకు కూడా ట్రాక్టర్, యంత్ర పరికరాలు అందజేశారు. వీటిని అద్దెకు తిప్పడం ద్వారా వచ్చే సొమ్మును గ్రూపు తరఫున తెరచిన ఖాతాలో జమ చేసుకుంటున్నాం. ఎలాంటి ఇబ్బంది లేకుండా సకాలంలో బ్యాంకు లోన్ కట్టుకుంటున్నాం. మా పొలంలో పనులకు కూడా వినియోగించుకుంటున్నాం. ఆధునిక విధానాల్లో సేద్యం చేసుకోవడం ఆనందంగా ఉంది.

– సుధాకర్ రెడ్డి, శ్రీవినాయక రైతు గ్రూపు, పందిళ్లపల్లె, చౌడేపల్లె మండలం

రాయితీపై యంత్రాలు



జిల్లాలో నాలుగేళ్లుగా వర్షాలు పుష్కలంగా కురిశాయి. ఫలితంగా సాగు విస్తీర్ణం పెరిగింది. అందుకు అనుగుణంగానే ప్రభుత్వం సైతం పూర్తిగా సహకరిస్తోంది. 40శాతం రాయితీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలు పంపిణీ చేస్తోంది. దీంతో ఎక్కువ మంది రైతులు గ్రూపులుగా మారి యంత్రాలు కొనుగోలు చేసుకుంటున్నారు. బాధ్యతాయుతంగా బ్యాంకు రుణాలను సైతం చెల్లించేస్తున్నారు.

– మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి, చిత్తూరు

అయ్యప్పస్వామి సేవలో మంత్రి పెద్దిరెడ్డి



అయ్యప్పస్వామి సేవలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కోటమల్లై అయ్యప్పస్వామి ఆలయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సతీమణి స్వర్ణలతమ్మతో ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలోని వినాయక, ఆంజనేయ, నాగమల్లేశ్వర, అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి, మనోహర్‌రెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నేత్ర దేవతకు టీటీడీ సారె

- సంప్రదాయబద్ధంగా సమర్పించిన మంత్రి ఆర్కే రోజా
- ప్రత్యేకత సంతరించుకున్న ఆడి బ్రహ్మోత్సవాలు



సారెను ఊరేగింపుగా తీసుకు వస్తున్న మంత్రి ఆర్కేరోజా

నగరి : ఆడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పట్టణంలో ప్రసిద్ధి చెందిన నేత్ర దేవత శ్రీదేశమ్మ ఆలయానికి టీటీడీ నుంచి పట్టు వస్త్రాల సారెను రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా ఆదివారం సమర్పించారు. అమ్మవారికి టీటీడీ నుంచి సారె సమర్పించే సంప్రదాయాన్ని గత ఏడాది నుంచి మంత్రి ఆర్కే రోజా ప్రారంభించిన సంగతి విదితమే. ఆదివారం పోతురాజు ఆలయం నుంచి సారెను తీసుకుని డప్పు, పంబ వాయిద్యాలు, మంగళ వాయిద్యాలు, కోలాటాలు, బాణసంచా వేడుకల నడుమ ఊరేగింపుగా దేశమ్మ ఆలయం వద్దకు చేరుకున్న మంత్రికి, ఆమె సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డికి ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. మంత్రి అమ్మవారికి సారెను సమర్పించి పూజల్లో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో అంబలిని సమర్పించారు. ఆడి బ్రహ్మోత్సవాలకు టీటీడీ సారె అందించే సంప్రదాయాన్ని తీసుకు వచ్చి బ్రహ్మోత్సవాలకు మరింత కీర్తి చేకూర్చినందుకు మంత్రిని వేద మంత్రాలతో ఆశీర్వదించి, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. దుశ్శాలువలతో సత్కరించి ఆలయ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామ దేవత దేశమ్మ ఆలయం నేత్రదేవత ఆలయంగా ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం పూర్తిగా అందిస్తున్నట్లు తెలిపారు. ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.20 కోట్లు మంజూరు చేయగా, పనులు వేగంగా జరుగుతోందన్నారు. అమ్మవారు ప్రజలను చల్లగా చూడాలని ప్రార్థించానని తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, ఈవో మునిశేఖర్, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, పలువురు కౌన్సిలర్లు, ధర్మకర్తలు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు యాదవుల ఆత్మీయ సభ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, పోకల అశోక్‌కుమార్, వెంకటరెడ్డి యాదవ్



పట్టణంలో ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీలు

- అతిథులుగా మంత్రులు పెద్దిరెడ్డి, కారుమూరి, ఎంపీలు మిథున్, రెడ్డెప్ప, మస్తాన్‌రావు
- యాదవ సంఘం విస్తృత ఏర్పాట్లు

పుంగనూరు: వైఎస్సార్‌సీపీ యాదవ ఆత్మీయ సభను సోమవారం పుంగనూరు రాగానిపల్లె జగనన్న కాలనీ మైదానంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు. యాదవ సంఘం నాయకులు వెంకటరెడ్డి యాదవ్, సుబ్రమణ్యయాదవ్ ఆధ్వర్యంలో జరుగుతున్న సభా ఏర్పాట్లను ఆదివారం చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, టీటీడీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి పరిశీలించారు. సుమారు 15 వేల మంది కుర్చునేందుకు వీలుగా సభా ప్రాంగణాన్ని అత్యంత సుందరంగా నిర్మించారు. సుమారు 25 మంది ప్రతినిధులు కుర్చునేందుకు వీలుగా వేదిక నిర్మించారు. అలాగే వీఐపీలు, యాదవులు వచ్చే వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ మోహన్‌కుమార్ బందోబస్తు ఏర్పాట్లను చేపట్టనున్నారు.

అతిథులకు కోస్తా విందు

వైఎస్సార్‌సీపీ యాదవ ఆత్మీయ సభకు హాజరయ్యే యాదవ కులస్తులకు కోస్తా రుచులతో విందు భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 20 వేల మందికి చేపల పులుసు, బిరియాని, స్వీట్లతో పాటు భోజనం వడ్డించనున్నారు. ఇందు కోసం కోస్తా నుంచి సుమారు 50 మంది వంట నిపుణులు ఇక్కడికి చేరుకున్నారు.

భారీ స్వాగత ఏర్పాట్లు

రాష్ట్ర మంత్రులు డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీలు పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, బీదమస్తాన్‌రావు యాదవ ఆత్మీయ సభకు అతిథులుగా హాజరు కానున్నారు. అలాగే వీరితో పాటు రాష్ట్రంలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ నేతలు, ప్రజాప్రతినిధులు రానున్నారు. వీరికి స్వాగతం పలుకుతూ యాదవ సంఘ ప్రతినిధులు రాగానిపల్లె బైపాస్ రోడ్డు వద్ద, సభా ప్రాంగణంలో భారీస్థాయిలో ఫ్లెక్సీలు, బెలూన్లు ఏర్పాటు చేశారు. బళ్లారి డ్రమ్ములు, డీజే సాంగ్స్‌తో సభా ప్రాంగణం దద్దరిల్లిపోయేలా మైకులు, స్పీకర్లు ఏర్పాటు చేశారు.

సభకు తరలిరండి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి యాదవుల అభివృద్ధికి కృషి చేశారని పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ తెలిపారు. యాదవుల ఐకమత్యాన్ని చాటిచెబుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపే ఆత్మీయ సభకు యాదవ కుటుంబ సభ్యులందరు వేలాదిగా తరలిరావాలని కోరారు.

నోబెల్ రికార్డులో ఆస్ట్రో ఆర్ట్ నమోదు



నోబెల్ బుక్ ఆఫ్ రికార్డ్ నమోదు పత్రాన్ని అందజేస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి



విద్యార్థులు గీసిన 10 వేల అడుగుల ఆస్ట్రో ఆర్ట్

చిత్తూరు కలెక్టరేట్ : నగరానికి చెందిన తపోవనం పాఠశాల, పలు విద్యాసంస్థల నుంచి పాల్గొన్న విద్యార్థులు 98 నిమిషాల్లో చంద్రయాన్ ఆర్ట్‌ను గీసి రికార్డు సృష్టించారు. చిత్తూరు నగరానికి చెందిన ఆస్ట్రోనామర్స్ సంస్థ ఆధ్వర్యంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని మెసానికల్ మైదానంలో ఆస్ట్రో ఆర్ట్ కార్యక్రమం నిర్వహించారు. బాల,బాలికలు 98 నిమిషాల్లో 10 వేల అడుగుల చంద్రయాన్ ఆర్ట్‌ను గీసి తమిళనాడుకు చెందిన నోబెల్ వరల్డ్ రికార్డులో నమోదయ్యారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి నోబెల్ వరల్డ్ రికార్డు నమోదు పత్రాన్ని సంస్థ నిర్వాహకురాలు దీపాలతకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల మక్కువ చూపి శాస్త్రవేత్తలుగా ఎదగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల నుంచి దాదాపు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్‌లో రాష్ట్ర స్థాయి ప్రతిభ

చిత్తూరు కలెక్టరేట్ : షూటింగ్ బాల్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు విద్యార్థుల జట్టు తృతీయ స్థానం సాధించినట్లు జూనియర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, నరేష్‌బాబు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో ఈనెల 12,13 తేదీల్లో 6వ రాష్ట్ర స్థాయి జూనియర్ షూటింగ్‌బాల్ పోటీలు జరిగాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొని తృతీయ స్థానం సాధించారని తెలిపారు.



బహుమతి అందుకుంటున్న చిత్తూరు జట్టు

విద్య, వైద్యం సీఎం మానస పుత్రికలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌రెడ్డి

పలమనేరు: రాష్ట్రంలో ప్రధానమైన విద్య, వైద్యం సీఎం జగనన్న మానస పుత్రికలని వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం చిత్తూరు జిల్లా వైఎస్సార్ టీచర్స్‌ఫెడరేషన్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉపాధ్యాయ సమస్యలపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా స్పందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో వైఎస్సార్‌టీఎఫ్ కార్యవర్గాలను ఎంపిక చేసి బలమైన ఉపాధ్యాయ సంఘంగా తీర్చిదిద్దుతామన్నారు.

జిల్లా నూతన కార్యవర్గ ఎంపిక


నాగరాజు, యువరాజులురెడ్డి, ఏఆర్ కుమార్, సోమచంద్రారెడ్డి

ఈ సందర్భంగా సంఘ జిల్లా నూతన కార్యవర్గ ఎంపిక జరిగింది. జిల్లా సలహాదారుగా సోమచంద్రారెడ్డి, గౌరవాధ్యక్షుడిగా నాగరాజు, అధ్యక్షుడిగా యువరాజరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జయకాంత్, కోశాధికారిగా ఏఆర్ కుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ధనుంజయ రెడ్డి, ఉపాధ్యక్షులుగా విశ్వనాథ్ రెడ్డి, ఇలియాజ్, శోభారాణి, రవీంద్రనాథ్, రాష్ట్ర కౌన్సిలర్లుగా రెడ్డి శేఖర్‌రెడ్డి, గోవిందస్వామితో పాటు మరో పది మంది కార్యనిర్వాహక సభ్యులను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, 98 డీఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

జిజ్ఞాస భూమిక..
విజ్ఞాన వీచిక



చిట్టిబుర్రల్లో మెదిలో ఆలోచనలకు పదును పెట్టి అద్భుతాలు సృష్టించవచ్చు. చిన్నారుల్లో సైన్స్‌పై జిజ్ఞాస పెంచేందుకు, నూతన ఆవిష్కరణల రూపకల్పనలను ప్రోత్సహించేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్‌ఫౌండేషన్ సంయుక్తంగా ప్రతి ఏటా 'ఇన్‌స్పైర్ అవార్డ్ మనక్' కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తోంది. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన వారిని బాల శాస్త్రవేత్తలుగా గుర్తిస్తుంది. ఈ విద్యాసంవత్సరం ఇన్‌స్పైర్ మనక్ పోటీల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. నామినేషన్ల దరఖాస్తు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇన్‌స్పైర్ మనక్ ప్రక్రియపై ప్రత్యేక కథనం..

- ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం
- కొత్త ప్రయోగాలు, ఆవిష్కరణలకు వేదిక
- ఒక్కో పాఠశాల నుంచి ఐదుగురికి అవకాశం
- దరఖాస్తుకు ఈనెల 31 ఆఖరు
- వైజ్ఞానిక ప్రదర్శనలు పెరిగేలా అధికారుల అవగాహన

జిల్లా పాఠశాలల సమాచారం..

ప్రాథమిక పాఠశాలలు	2,079
చదువుతున్న విద్యార్థులు	93,563
ప్రాథమికోన్నత పాఠశాలలు	287
చదువుతున్న విద్యార్థులు	26,219
ఉన్నత పాఠశాలలు	515
చదువుతున్న విద్యార్థులు	1,24,924
మొత్తం పాఠశాలలు	2,881
మొత్తం విద్యార్థులు	2,44,706

గత ఐదేళ్లలో ఇన్‌స్పైర్ ఎంపిక వివరాలు

సంవత్సరం	నామినేషన్‌లు	జిల్లా స్థాయిలో ఎంపికైనవి
2017-18	2550	835
2018-19	4780	1780
2019-20	5276	299
2020-21	5177	565
2021-22	6288	797
2022-23	6602	836


2020-21లో జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మనక్‌లో ఎంపికైన విద్యార్థిని

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి బాల శాస్త్రవేత్తలుగా తయారు చేసేందుకు ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2009 నుంచి ఇన్‌స్పైర్ మనక్ పేరిట విజ్ఞాన మేళాను నిర్వహిస్తున్నాయి. నామినేషన్‌ల కసరత్తు పూర్తి అయిన తర్వాత జిల్లా స్థాయిలో పోటీల ప్రదర్శన నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన వారికి రాష్ట్ర స్థాయిలో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తారు. అక్కడ ఎంపికైతే జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం ఉంటుంది. ఇలా జాతీయ స్థాయిలో ఎంపికైన విద్యార్థులను బాల శాస్త్రవేత్తలుగా గుర్తించి రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేస్తారు. ఇన్‌స్పైర్ మనక్ 2023-24 సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల నుంచి నూతన ఆవిష్కరణలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. జిల్లాల్లో అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని 6 నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా 2023-24 సంవత్సరానికి దరఖాస్తులు చేసుకునేందుకు ఆగస్టు 31 వరకు అవకాశం కల్పించారు.

ఆరు నుంచి పదో తరగతి వరకు

జిల్లా వ్యాప్తంగా 2,881 వివిధ యాజమాన్యాల పాఠశాలలున్నాయి. వీటిల్లో 2,44,706 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇన్‌స్పైర్ మనక్ విజ్ఞాన మేళాలో పాల్గొనేందుకు జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత, ప్రైవేటు, కస్తూర్బా, గురుకుల, ఆదర్శ పాఠశాలలో విద్యనభ్యసించే ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు అవకాశం ఉంటుంది. ఒక పాఠశాల నుంచి ఐదుగురికి మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. విద్యార్థి పూర్తి వివరాలతో పాటు ప్రదర్శించే ఎగ్జిబిట్‌కు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందు పర్చాలి. జిల్లా స్థాయిలో ఎంపికయ్యే వారికి రూ. 10 వేలు, రాష్ట్ర స్థాయికి ఎంపికైతే రూ.40 వేలు, జాతీయ స్థాయికి ఎంపికైన వారికి రూ.60 వేల నగదు బహుమతిని నేరుగా విద్యార్థి అకౌంట్‌లో జమ చేస్తారు.ఈ కసరత్తు పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3 ప్రాజెక్టులకు దరఖాస్తులు, ఉన్నత పాఠశాల నుంచి 5 దరఖాస్తులు వచ్చేలా ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచిస్తున్నారు. ఇన్‌స్పైర్ మనక్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. ఇన్‌స్పైర్ మనక్ పోస్టర్లను ఆవిష్కరించి పలు సూచనలు జారీచేశారు.

దరఖాస్తు విధానం ఇలా

ఇన్‌స్పైర్ మనక్ అవార్డులో పాల్గొనేందుకు ప్రాజెక్ట్ వివరాలను పాఠశాల ఐడీ ద్వారా గడవులోపు www. inspire awards dst. gov. in వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. విద్యార్థి పాఠశాలకు సంబంధించిన వివరాలను పొందుపరచి సేవ్ చేయాలి. విద్యార్థుల దరఖాస్తు సంబంధిత జిల్లా అథారిటీకి చేరుతుంది. దరఖాస్తు ఆమోదించిన తర్వాత దరఖాస్తుదారు ఇచ్చిన ఈ మెయిల్ ఐడీకి యూజర్ ఐడీతో కూడిన లింక్ వస్తుంది. దరఖాస్తుదారుకు వచ్చిన లింక్‌తో వచ్చిన ఐడీతో పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలి. అనంతరం విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాలి.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఇన్‌స్పైర్ మనక్ పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థుల్లో దాగి ఉన్న ఆలోచనలు, నైపుణ్యాలు వెలికితీసేందుకు మంచి వేదిక. పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలి. విద్యార్థుల మదిలో మెదిలే, సమాజంలోని సమస్యలకు సరికొత్త పరిష్కారాలు కనుగొనే విధంగా ప్రాజెక్టులుండాలి.

\- షణ్మోహన్, కలెక్టర్

గడువులోపు ప్రక్రియ పూర్తి చేయాలి



ఈనెల 31 లోపు ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు నామినేషన్ ప్రక్రియకు అవకాశం కల్పించాలి. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు గడువులోపు నామినేషన్‌ల ప్రక్రియను పూర్తి చేయాలి. అలసత్వం వహిస్తే శాఖాపరంగా చర్యలుంటాయ్. ఆసక్తి ఉన్న విద్యార్థులు పోటీల్లో పాల్గొని తమ సత్తాను చాటేలా ప్రోత్సహించాలి.

\- విజయేంద్రరావు, డీఈఓ

మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలి



నామినేషన్లలో ఈ ఏడాది జిల్లాను జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తాం. ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కసరత్తు చేపడుతున్నాం. 6 నుంచి 10 వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్‌లో పాల్గొనవచ్చు. అన్ని మేనేజ్‌మెంట్‌ల విద్యార్థులు పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. ఇన్‌స్పైర్ మనక్ వెబ్‌సైట్‌లో ప్రాజెక్టుల ప్రతిపాదనలను నమోదు చేసుకోవాలి. జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

\- వెంకటరమణ, జిల్లా సైన్స్ అధికారి, చిత్తూరు

పాలూరు సచివాలయానికి నిప్పు


సంఘటన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ, డీపీఓ

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం పాలూరు సచివాలయ భవనానికి గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం నిప్పంటించారు. ఈ ఘటనలో మెడికల్ విభాగం గదిలోని పత్రాలు, టేబుల్ కాలిపోయాయి. విషయం తెలుసుకున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీపీఓ లక్ష్మి సచివాలయాన్ని పరిశీలించారు. స్థానికులు, సిబ్బందిని విచారించారు.

జాతీయ సమైఖ్యతను చాటుదాం


జెండాలను అందజేస్తున్న సంఘం నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న డ్రైవర్లు ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పన్నీర్ సెల్వం కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయంలో జాతీయ జెండాలను సంఘ సభ్యులకు ఉచితంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పిలుపు మేరకు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ను పురస్కరించుకుని ఈనెల 15వ తేదీ వరకు ఇళ్లపై జెండాను ఎగురవేయాలన్నారు. సంఘం నాయకులు షణ్ముగం, రామన్న సురేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 3కే రన్



తిరుపతి సిటీ : చిత్తూరు జిల్లా బాయ్స్ అండ్ గర్ల్స్ క్రికెట్ అసోసియేషన్ వారు ఆదివారం తిరుపతిలో నిర్వహించిన 3కే రన్ ఉత్సాహంగా సాగింది. ఉదయం 8గంటలకు ఎస్వీయూ తారకరామా స్టేడియం నుంచి క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి స్పోర్ట్స్ టార్చ్ వెలిగించి రన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన వైజాగ్‌లోని డాక్టర్ వైఎస్సార్ స్టేడియంలో మన ఆంధ్ర- మన ఏపీఎల్ (ఆంధ్రా ప్రీమియర్ లీగ్) సీజన్-2 ప్రారంభంకానున్న నేపథ్యంలో క్రీడాకారులకు మద్దతుగా 3కే రన్ చేపట్టినట్లు వెల్లడించారు. యువతలోని ప్రతిభను వెలికితీసి అంతర్జాతీయ క్రికెటర్లగా తయారు చేయడమే ఏపీఎల్ క్రికెట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. క్రీడారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి సహకారం అందిస్తున్నారని వివరించారు. బాలాజీ కాలనీ, టౌన్ క్లబ్, కృష్ణాపురం ఠాణా, గాంధీరోడ్డు వరకు 3కే రన్ ఉత్సాహంగా సాగింది.

భార్యను చంపి.. ఆత్మహత్యగా చిత్రీకరించి..

- విచారణలో విషయం వెలుగులోకి
- హత్య కేసుగా నమోదు

చిత్తూరు అర్బన్: భార్యను పథకం ప్రకారం హత్య చేసి.. దాన్ని ఆత్మహత్యగా చిత్రీకరించాడో భర్త. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసుల రంగ ప్రవేశం చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. చిత్తూరు నగరంలో ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటనపై టూ టౌన్ సీఐ మద్దయ్యాచారి కథనం మేరకు.. గుడిపాల మండలం 190 రామాపురానికి చెందిన సుగుణ,(34)కు యాదమరి మండలం మాధవరానికి చెందిన మహేష్‌తో 12 ఏళ్ల క్రితం పెద్దల సమక్షంలో పెళ్లయింది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిత్తూరులో పెయింటర్‌గా పని చేస్తున్న మహేష్ గంగనపల్లెలో భార్యాపిల్లలతో కాపురం పెట్టాడు. సుగుణ కొంగారెడ్డిపల్లెలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తోంది. కొంతకాలంగా సుగుణను అదనపు కట్నం తీసుకు రావాలంటూ మహేష్ చిత్రహింసలకు గురి చేస్తున్నాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఆమెపై దాడి చేశాడు. మధ్యాహ్నం సుగుణ ఆత్మహత్య చేసుకుందంటూ ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారు అక్కడికి వచ్చి సుగుణ మృతదేహాన్ని పరిశీలించారు. 'నువ్వే చంపేశావంటూ' అల్లుడిపైగా దాడికి దిగారు. పోలీసులు వచ్చి పరిస్థితిని సర్దుమణిగించారు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే సుగుణ ఆత్మహత్య చేసుకున్నట్లుగా ఓ ఉత్తరం సృష్టించడం.. అదే ఉత్తరంలో తన ఎదుట సుగుణ రాసిన ఆత్మహత్య లేఖ అంటూ మహేష్ సంతకం పెట్టడం పోలీసులకు అనుమానం తెప్పించింది. మృతదేహాన్ని పరిశీలించగా గొంతును చున్నీతో చుట్టి చంపినట్లు గుర్తులు ఉండడం, ఆత్మహత్య సమయంలో తలుపు గడి వేయకపోవడం, గాజులు పగిలి ఉండడాన్ని చూసి సుగుణది హత్యగా ప్రాథమికంగా పోలీసులు గుర్తించారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జీవితానికి దగ్గరగా చదరంగం


సీనియర్ విజేతలతో మంత్రి ఆర్‌కే రోజా

- గెలుపోటములు సహజం
- చెస్ విజేతల బహుమతుల ప్రదానోత్సవంలో మంత్రి రోజా

నగరి : చదరంగానికి జీవితంతో దగ్గరి సంబంధం ఉందని రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. ఆదివారం నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని కేవీకే స్టేడియంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా చెస్ అసోసియేషన్ సహకారంతో లయన్స్ క్లబ్, చెస్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన చదరంగం పోటీల విజేతలకు ఆదివారం బహుమతుల ప్రదానం కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి బహుమతులను అందించారు. 170 మంది పోటీల్లో పాల్గొనగా జూనియర్స్ విభాగంలో తిరుపతికి చెందిన వి.భరద్వాజ ప్రమోజ్ఞ, కె.సాయిచరణ్, దేవకి నందన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. సీనియర్స్ విభాగంలో తిరుపతికి చెందిన సంతోష్, ఎతిన్‌రెడ్డి, చిత్తూరుకు చెందిన గుణశేఖర్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి రోజా మాట్లాడుతూ మనిషి మేధస్సుకు పదును పెట్టే చదరంగ పోటీలు అంటే తనకు చాలా ఇష్టమని, జీవితంలో ప్రతి చోటా, ప్రతి సందర్భంలోనూ వ్యూహాలు వేయడానికి మనిషికి మేధస్సు ఎంత అవసరమో ఆ శక్తిని చదరంగం ద్వారా పొందవచ్చన్నారు. గెలుపోటములు సహజమని, అందుకు కుంగిపోకూడదన్నారు.

ఓటమిని గెలుపునకు సోపానంగా మార్చుకోవాలని, అప్పుడు విజయం తథ్యమన్నారు. ఇందుకు తానే ప్రత్యక్ష సాక్ష్యమని తెలిపారు. సినీ, రాజకీయ రంగాల్లో తొలుత అపజయాలనే చూశానన్నారు. అయినా తాను ఏనాడు వెనకడుగు వేయలేదని, అదే తన ఉన్నతికి ఉన్నతికి కారణమని తెలిపారు. క్రీడాకారులకు తనవంతు ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా డైరెక్టర్ ప్రభాకర్ రాజు, అధ్యక్షుడు మోహన్, సీనియర్ క్రీడాకారులు ఓ.బాలసుబ్రమణ్యం, తిరుపతి చెస్ అసోసియేషన్ కోఆర్డినేటర్ బాలాజీ, నగరి చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఖలీల్‌బాషా, సీనియర్ చెస్ శిక్షకుడు నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా భీజాక్షర హోమం


హోమ పూజల్లో పాల్గొన్న దంపతులు


అమ్మవారి సేవలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: చిత్తూరు శ్రీకన్యాకపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం(చిత్తూరు అర్బన్ జిల్లా) ఆధ్వర్యంలో శ్రీవాసవి కన్యాకపరమేశ్వరి భీజాక్షర హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత అమ్మవారిని విశేషంగా అలంకరించి హోమ నిర్వహణ మండపంలో ఆశీనులు చేశారు. అనంతరం 102 మంది దంపతులచే భీజాక్షర హోమ పూజలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దంపతులు నిష్ఠతో ఉపవాస దీక్షతో హోమ పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కూడా హోమ పూజల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆరూర్ ప్రసాద్‌బాబు, నాయకులు నరసింహులు శెట్టి, ద్వారకనాథ్, సభ్యులు పాల్గొన్నారు.